# సీఎం కేసీఆర్ సభకు తరలిరావాలి

హుస్నాబాద్ టౌన్, అక్టోబర్ 12: అభివృద్ధి, సంక్షేమ ఫలాలు సమానంగా అందిస్తున్న బీఆర్ఎస్ ప్రభుత్వానికి అండగా నిలిచేందుకు ఈనెల 15న హుస్నాబాద్‌లో జరిగే సీఎం సభకు ప్రజలు భారీగా తరలిరావాలని మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజితా వెంకన్న, బీఆర్ఎస్ పట్టణ ఇన్‌చార్జి మచ్చ వేణుగోపాల్‌రెడ్డి పిలుపునిచ్చారు. హుస్నాబాద్‌లో జరిగే సీఎం కేసీఆర్ సభను విజయవంతం చేసేందుకు పలు వార్డుల్లో బీఆర్ఎస్ ముఖ్యనాయకులు, కార్యకర్తలతో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశంలోనే తెలంగాణ రాష్ట్రం అభివృద్ధిలో ముందున్నదన్నారు. ప్రతి కుటుంబానికీ సంక్షేమ ఫలాలను అందిస్తున్న ఏకైక ప్రభుత్వం బీఆర్ఎస్ మాత్రమేనన్నారు. సీఎం సభకు తరలివచ్చేందుకు కౌన్సిలర్లు, నాయకులు, కార్యకర్తలు ఏర్పాట్లు చేయాలన్నారు. సమావేశంలో వైస్ చైర్‌పర్సన్ అయిలేని అనిత, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు ఎండీ అన్వర్, వర్కింగ్ ప్రెసిడెంట్ చిట్టి గోపాల్‌రెడ్డి, మాజీ ఎంపీపీ ఆకుల వెంకట్, కౌన్సిలర్లు కొంకట నళినిదేవి, బోజు రమాదేవి, గోవిందు రవి, పెరుక భాగ్యారెడ్డి, గూళ్ల రాజు, బొల్లి కల్పన, జనగామ రత్నమాల, మిర్యాల రమేశ్, బొజ్జ హరీశ్, వాల సుప్రజ, కోఆప్షన్ సభ్యులు శంకర్‌రెడ్డి, ఆయూబ్ ఉన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజితావెంకన్న

## మంత్రి హరీశ్‌రావుకు ఆహ్వానం



మంత్రికి అహ్వానపత్రికను అందజేస్తున్న ఉల్లెంగల ఏకానందం

చేర్యాల, అక్టోబర్ 12: ఉల్లెంగల సేవా ట్రస్టు ఆధ్వర్యంలో మండలంలోని ఆకునూరు గ్రామ శ్రీభవానీ రుద్రేశ్వర ఆలయంలో నిర్వహించే శరన్నవరాత్రోత్సవాలకు హాజరుకావాలని కోరుతూ ఆహ్వాన పత్రికను గురువారం ఆర్థిక, వైద్యారోగ్య శాఖల మంత్రి తన్నీరు హరీశ్‌రావుకు ట్రస్టు చైర్మన్, బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి ఉల్లెంగల ఏకానందం అందజేశారు. ఈ సందర్భంగా మంత్రికి శాలువా కప్పి సన్మానించి ఆహ్వానపత్రికను అందించారు. అనంతరం ఆయన చేర్యాలలో విలేకరులతో మాట్లాడారు. క్రీస్తుశకం 8వ శతాబ్దంలో శివాలయాన్ని రాష్ట్రకూటులు నిర్మించినట్లు తెలిపారు. ఆలయాన్ని కాకతీయులు విస్తరించినట్లు తెలిపారు. ఆలయంలో అమ్మవారిని, బ్రహ్మసూత్రం కలిగిన అరుదైన పురాతన శివలింగాన్ని, బైరవుడు, గణపతి, నందీశ్వరులను ప్రతిష్ఠించినట్లు పేర్కొన్నారు. 100 మంది వేద పండితులు కాశీ నుంచి వచ్చి యంత్రి ప్రతిష్ఠ చేసినట్లు శిలాశాసనంపై చెక్కి ఉన్నదన్నారు. దేవాలయంలో ఈ నెల 15 నుంచి నిర్వహించే శరన్నవరాత్రోత్సవాలకు మంత్రి హరీశ్‌రావు, ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి, ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డి తదితరులు హాజరుకానున్నట్లు తెలిపారు.

# 25 వేల మందితో కదిలివస్తాం

అక్కన్నపేట, అక్టోబర్ 12: హుస్నాబాద్‌లో ఈ నెల 15న జరిగే సీఎం కేసీఆర్ సభకు భారీగా తరలిరావాలని ప్రోగ్రాం మండల ఇన్‌చార్జి ఎడ్ల సోమిరెడ్డి పిలుపునిచ్చారు. గురువారం మండలంలోని గౌరవెల్లి, కెప్టెన్‌కాలనీ, జనగామ, గుబ్బడి, గొల్లకుంట, అంతక్కపేట, అక్కన్నపేట, పంతుల్ తండా, కేశనాయక్‌తండా గ్రామాల్లో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సోమిరెడ్డి మాట్లాడుతూ.. అక్కన్నపేట మండలం నుంచి 25 వేల మంది బహిరంగ సభకు వచ్చేలా ప్రణాళికలు చేశామన్నారు. సీఎం కేసీఆర్ రెండు దఫాలు హుస్నాబాద్ నియోజకవర్గం నుంచే ఎన్నికల ప్రచారానికి శ్రీకారం చుట్టారన్నారు. బీఆర్ఎస్‌కు హుస్నాబాద్ లక్ష్మి నియోజకవర్గంగా మారిందన్నారు. బహిరంగ సభకు తరలివచ్చేందుకు వాహనాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. పార్టీ కార్యకర్తలు, నాయకులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, సింగిల్ విండో డైరెక్టర్లు, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు, మాజీ ప్రజాప్రతినిధులు, గ్రామ పార్టీ శాఖ, అనుబంధ సంఘాల నాయకులు పెద్ద ఎత్తున్న బహిరంగ సభకు స్వచ్ఛందంగా రావాలని కోరారు. అక్కన్నపేట మండలంలో గిరిజన తండాలను గ్రామ పంచాయతీలుగా మార్చి, వాటి అభివృద్ధికి నిరంతరం సీఎం కేసీఆర్ కృషి చేశారన్నారు. జడ్పీ వైస్ చైర్మన్ రాయిరెడ్డి రాజిరెడ్డి మాట్లాడుతూ.. పార్టీకి కార్యకర్తలే బలం, బలగమన్నారు. పార్టీ పిలుపునిచ్చే కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరారు. బీఆర్ఎస్ చేసిన అభివృద్ధి కండ్ల ముందు కనిపిస్తున్నదన్నారు. అభివృద్ధి నిరంతరంగా కొనసాగాలంటే మరోమారు బీఆర్ఎస్‌కు పట్టాం కట్టాలన్నారు. మూడోసారి ఇటు ప్రభుత్వాన్ని, అటు హుస్నాబాద్ ఎమ్మెల్యే వొడితెల సతీశ్‌కుమార్‌ను భారీ మెజార్టీతో గెలుపించుకోవాలన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండలాధ్యక్షుడు పెసరు సాంబరాజు, మాజీ జడ్పీటీసీ మాలోతు బీలునాయక్, ఏఎంసీ మాజీ చైర్మన్ కాసర్ల అశోక్‌బాబు, బీఆర్ఎస్వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సూరంపల్లి పరశురాములు, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు, పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



అంతక్కపేటలో బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న మండల ఇన్‌చార్జి సోమిరెడ్డి

## ఎమ్మెల్యే సతీశ్‌కుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలి

హుస్నాబాద్‌రూరల్, అక్టోబర్ 12: హుస్నాబాద్‌లో ఈ నెల 15న నిర్వహించే సీఎం కేసీఆర్ సభను విజయవంతం చేయాలని జడ్పీ వైస్ చైర్మన్ రాయిరెడ్డి రాజిరెడ్డి పిలుపునిచ్చారు. గురువారం మండలంలోని పొట్లపల్లిలో ఆయన బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి ఆశీర్వాద సభకు పొట్లపల్లి నుంచి కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలిరావాలన్నారు. వచ్చే ఎన్నికల్లో మూడోసారి ఎమ్మెల్యేగా సతీశ్‌కుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపించేందుకు కార్యకర్తలు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు వంగ వెంకట్రాంరెడ్డి, నాయకులు గడ్డం మల్లయ్య, రవీందర్‌రెడ్డి, సలీం, నర్సింహారెడ్డి, పాకాల శ్యాంసుందర్‌గౌడ్, వెంకటస్వామి, మార్క అనిల్ గౌడ్, నాంపల్లి శంకర్, రాచపల్లి శ్రీను, చుక్క శ్రీనివాస్, మల్లయ్య, సంతోష్, శ్రీధర్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## కాడెద్దు దాడిలో రైతు మృతి

చేర్యాల, అక్టోబర్ 12: మండలంలోని ఆకునూరు గ్రామానికి చెందిన పెంటపర్తి లింగారెడ్డి(60) అనే రైతును ఇటీవల కాడెద్దు పొడవడంతో గురువారం పరిస్థితి విషమించి మృతి చెందాడు. పది రోజుల క్రితం లింగారెడ్డి జాల సంజీవరెడ్డి పత్తి చేనులో గుంటక కొట్టేందుకు వెళ్లిన సమయంలో కాడెద్దు తీవ్రంగా గాయపర్చింది. ఈ దాడిలో తీవ్రంగా గాయపడ్డ లింగారెడ్డిని హైదరాబాద్‌లోని గాంధీ దవాఖానలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందాడు. మృతుడికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

## బెల్ట్‌షాపుల నిర్వాహకుల బైండోవర్

మద్దూరు(ధూళిమిట్ట), అక్టోబర్ 12: మద్దూరు తహసీల్దార్ అనంతరెడ్డి ఎదుట 11మంది బెల్ట్ షాపు నిర్వాహకులను ఎక్సైజ్ అధికారులు గురువారం బైండోవర్ చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ఎన్నికల నేపథ్యంలో అక్రమంగా బెల్ట్‌షాపులు నిర్వహిస్తున్న గాగిల్లాపూర్‌లో ఏడుగురు, మర్మాములలో నలుగురు వ్యక్తులను బైండోవర్ చేసినట్లు తెలిపారు. బైండోవర్ అయిన వ్యక్తులు తిరిగి అదే నేరానికి పాల్పడితే రూ.1లక్ష జరిమానా విధించనున్నట్లు హెచ్చరించారు.

# బతుకు మార్చిన ‘దళితబంధు’

- పాల డెయిరీతో మారిన మేస్త్రీ జీవితం
- మూడు ఎకరాల పొలం అచ్చుకట్టు
- బోరు, పైపులైన్, నీటి తొట్టి నిర్మాణం

చేర్యాల, అక్టోబర్ 12: సీఎం కేసీఆర్ ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన దళితబంధు పథకం ఓ పేద మేస్త్రీ జీవితాన్ని మార్చివేసింది. మండలంలోని ఆకునూరు గ్రామానికి చెందిన కోతి యేబు మేస్త్రీ పని చేసుకుంటూ జీవనం సాగించేవాడు. దళితబంధు పథకంలో సీఎం కేసీఆర్ యేబుకు రూ.10 లక్షలు మంజూరు చేయడంతో ఆయన జీవితమే మారిపోయింది. తనకున్న వ్యవసాయ భూమి వద్ద పాల డెయిరీ నిర్మించుకోగా సంబంధిత అధికారులు 5 పాడి గేదెలను కొనుగోలు చేసి అప్పగించారు. దీంతో యేబు తన మూడెకరాల భూమిలో బోరు వేసుకోవడమే కాకుండా 40 పైపులతో డెయిరీ వద్దకు పైపులైన్ నిర్మాణం చేపట్టి అందులో నీటి తొట్టిని నిర్మించుకున్నాడు. తనతోపాటు ఇద్దరు కుమారులు సైతం పాడి గేదెల ఆలనాపాలనా చూసుకుంటున్నారు.



దళితబంధుతో ఏర్పాటు చేసుకున్న డెయిరీ వద్ద పాడిగేదెతో రైతు యేబు

### ఒక్కో గేదె 8 లీటర్ల పాలు

మూడు నెలల క్రితం ప్రారంభించిన పాల డెయిరీలో ప్రస్తుతం ఒక్కో గేదె రోజు వారీగా 8 లీటర్ల పాలు ఇస్తున్నదని యేబు సంతోషం వ్యక్తం చేస్తున్నాడు. ఆ పాలను లీటరు రూ.40 చొప్పున గ్రామంలో విక్రయించుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. అలాగే వ్యవసాయ భూమిలో జొన్న, సజ్జలతోపాటు వరి సాగు చేస్తున్నాడు. మున్ముందు కూరగాయలు సైతం పండించేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నాడు.

## వంగి కష్టం చేసుకుంటే లాభం అదే వస్తది



వంగి కష్టం చేసుకుంటే ఎందులోనైనా లాభాలు వస్తాయి. నాకు వచ్చిన దళితబంధుతో ఇంటిల్లిపాది కష్టం చేసుకుంటున్నాం. ఇప్పుడు నాలుగు బర్లు పాలు ఇస్తున్నాయి. కొన్ని విజయ డెయిరీకి, మరిన్ని పాలు ఇరుగుపొరుగు వారికి పోసి వచ్చిన డబ్బులతో పాడి పశువులకు ఖర్చు చేస్తున్నా. సీఎం కేసీఆర్ సార్ ఇచ్చిన పైసలు ఖరాబు కాకుండా పని చేసుకొని బతుకుతున్నా. కలెక్టర్ సార్ కూడా అన్నం పెట్టి చెప్పిండు. వంగి పని చేసుకోవాలని.. అదే పద్ధతిలో పని చేసుకుంటున్నాం. సీఎం కేసీఆర్ పార్టీ పెట్టినప్పటి నుంచి అందులోనే తిరుగుతున్నా.. దళితుల కోసం బీఆర్ఎస్ ప్రభుత్వం ఎన్నో కార్యక్రమాలు తీసుకువచ్చింది. సీఎం కేసీఆర్, మంత్రి హరీశ్‌రావు, ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డికి రుణపడి ఉంటాం.

– యేబు, రైతు